దీన్ని మీరు నా స్వార్థం అనుకోండి, ఇంకేదైనా అనుకోండి. కాని, నన్ను క్షమిస్తారని కోరుతూ న్నాను"

"అలా కోరవలసింది నేను. మీరు కాదు" అంటూ కుర్చీలోంచి లేచాడు విశ్వేశ్వరరావు. గట్టిగా ఓ నిట్టూర్పు విడిచి, నమస్తే!" అంటూ తలవాచుకుని బయటపడ్డాడు. ఈ విచిత్ర వ్యక్తిత్వాన్ని గురించి సరళ కూడా ఎందుకో నిట్టూర్చకుండా వుండలేకపోయింది.

ఇందాక వెళ్ళేప్పుడూ విశ్వేశ్వరరావు హృదయం స్పందించింది. ఇప్పుడూ స్పందిస్తూనే వుంది. ఇందాకటిలా బుర్ర వేడెక్కే వుంది. ఇందాక ఎలా అదృశ్యశక్తి మెడకట్టి జానకి యింటికి గెంటిందో, అంతకంటే బలమైన శక్తి ఇప్పు డక్కడ్నో పనిచేస్తోంది. "ప్రపంచానుభవం లేని శుష్కభావుకతకీ, జీవితాచరణకీ యెంత తేడా వుంటుందో జానకినీ సరళనీ చూస్తే తెలుస్తుంది" అనుకుంటున్నాడు విశ్వేశ్వరరావు. ఆతని మనస్సు పూర్తిగా అలసిపోయింది. ఆరు నెలలు జైలు చీకటికొట్లో వుండి సుప్రభాత సూర్యోదయాన్ని చూస్తూన్న ఖైదీ కళ్ళలా అతని కళ్ళు మూతలుపడుతున్నాయి. మనస్సు విశ్రాంతిని కోరుతోంది. ఎక్కడా తనకు విశ్రాంతి? ఎటూ తను వెళ్తాంటు? ఏదీ తోచని స్థితిలో విశ్వేశ్వరరావు దగ్గరనే వున్న హోటల్లో ప్రవేశించి, ఓ మూలన కుర్చీలో అతుక్కుపోయాడు.

---

<u>స్కెచ్</u>

# పెళ్ళిచూపులు

<u>ఎన్. ఆర్. నంది</u>

**బం**డి దిగీ దిగగానే ద్వారం దగ్గరే యెదురై అమ్మ ముఖం యింత చేసుకొని అడిగింది:

"ఏమయిందిరా - పండా, కాయా?"

నేను సమాధానం చెప్పలేదు. తిన్నగా నాగదిలోకిపోయి కూచున్నా. వెనకాలే చిరునవ్వుతో వస్తున్న పెద్దన్నయ్యను ఏమడిగిందో మరి, అయనేం సమాధానం చెప్పాడో రయ్యిమంటూ నాగదిలోకి వచ్చి పడింది అమ్మ:

"పిల్లా నచ్చి, నీకు పెళ్ళంటే అయిష్టత లేకండావుండీ - మరేం మూడిందనిరా వచ్చిన సంబంధాలనన్నిటినీ అలా తిరగ్గొట్టేస్తున్నావ్?" అంటూ అరచింది.

ఆ అరుపులు నేనేం లెఖ్ఖచెయ్యలేదు. చెయ్యాల్సిన అవసరంగూడా లేదు.

అసలింతకీ నాకు పెళ్ళంటే యిష్టంలేదు. మా జగన్నాథం అన్నట్టు, తెలుగువాణ్ణి గాబట్టి నాకు ప్రతీవిషయం మీదా కొన్ని అభిప్రాయాలంటూ వున్నాయి. ఇలా ప్రతీవిషయంమీదా కొన్ని అభిప్రాయాలంటూ వుండటం తెలుగుజాతి నేషనల్ రోగంలా వుందని వాడు వెటకారించినా - నాకు మాత్రం పెళ్ళిమీద మహాగొప్ప అభిప్రాయాలున్నాయి లెండి!

"ఏవిటో అంతలావాటి అభిప్రాయాలు!" అంటారుమీరు-

అన్నా! గొప్ప చిక్కొచ్చిందే! అభిప్రాయాలంటూ వున్నాయిగాని అవి ఏవిటని మీరిలా నిలదీసి అడుగుతే ఒక్కసారిగా చప్పున ఎలా చెప్పగలను చెప్పండీ? ఏదో అమ్మా, నాన్నగారు పెళ్ళాడవయ్యా మహాప్రభూ! బెండకాయ ముదిరినా, బహ్మచారి ముదిరినా మహా ముప్పుసుమా" అంటూ వేధిస్తూవుంటే వాళ్ళనించి తప్పించుకోడానికీ అనండి, మరోహటేదైనా అనండి:

"నాకిప్పుడప్పుడే పెళ్ళాడాలని లేదమ్మా" అనేస్తాను.

"ఎందుకో?" అని అడుగుతారు కొందరు స్నేహితులు-

నిజం చెప్పొద్దూ, అప్పుడు వేదాంతం పుట్టుకొస్తుంది.

"ఆఁ! మీరంతా పెళ్ళాడి ఏం సుఖపడిపోతున్నారు లెద్దురూ! వెధవది పెళ్ళంటూ ఆడితే ఆ అమ్మగారికోర్కెలు చెల్లించలేక చావాలి. తీరా ఒక ఏడాది గడిస్తే ఆవిడ కాస్తా ఒక నలుసుని